ఆస్పత్రుల్లో నాణ్యతకు మార్క్

- ఆరోగ్య సంరక్షణ.. వైద్యసేవల పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి
- అర్హత సాధించిన ఆస్పత్రులకు మూడేళ్ల పాటు నిధులు
- జిల్లాలో పలు ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల ఎంపిక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఆరోగ్య సంరక్షణ సేవల నాణ్యతను మెరుగు పరిచేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) అమలు చేస్తోంది. మెటర్నిటీ, జిల్లా ఆస్పత్రులు, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో నాణ్యమైన సేవలకు గాను ×ఎస్‌క్వాస్‌¥ అర్హత సర్టిఫికెట్ జారీ చేస్తారు. అర్హత సాధించిన తర్వాత మూడేళ్ల పాటు ఆస్పత్రులకు కేటగిరీల వారీగా కేంద్రం నిధులు ఇస్తుంది. 2024–25, 26, 27 సంవత్సరాలకు గాను మొదటి విడతలో జిల్లాలోని పలు ఆస్పత్రులను ఎంపిక చేశారు. ఇటీవల పర్యటించిన ఎన్‌క్వాస్ బృందం పలు ఆస్పత్రులను గుర్తించింది. ఇదంతా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, నాణ్యత, సేవలతోనే ఈగుర్తింపును తెచ్చిపెడుతోందని పలువురు చెబుతున్నారు.

జిల్లాలో ఒక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 సీహెచ్‌సీలు, 4 ఏరియా ఆస్పత్రులు, 15 అర్బన్‌హెల్త్ సెంటర్లు, 464 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల కాలం పాటు వీటిల్లో మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా చేసుకుంది. అన్ని రకాల మందులు, మాత్రలు, సేవలు అందించడంతో పాటు అందులో నాణ్యత ఉండేలా చూసింది. ఆస్పత్రుల అభివృద్ధిని పరుగులు పెట్టించింది. తద్వారా పేదలకు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పక్కాగా అందాయి. ఇటీవల నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ టీం జిల్లాలో పర్యటించింది. పలు ఆస్పత్రుల తీరును పరిశీలించి గుర్తింపు నిచ్చింది. ఈ నేపథ్యంలో మరింత అభివృద్ధికి ఆర్థికంగా చేయూతనివ్వనుంది.

నిర్వహణ అంశాలు

ఆస్పత్రిలో ఆరోగ్య సంరక్షణ, నాణ్యతా ప్రమాణాలు, మౌలిక వసతులు, సిబ్బంది పనితీరు, రోగి సంరక్షణ, ఆస్పత్రి నిర్వహణ, ఇన్ఫెక్షన్ల నియంత్రణ, మార్గదర్శకాలను పాటించడం, అత్యవసర సేవలు, ఖచ్చితమైన రోగ నిర్ధారణ, శస్త్ర చికిత్స విధానంలో భద్రత, నైపుణ్యం, సమర్థవంతంగా ఫార్మసీ నిర్వహణ, పరిశుభ్రమైన శానిటేషన్, సపోర్ట్ సర్వీసెస్, క్లినికల్ కేర్, ఓపీ సేవలు, వైద్యపరికరాల నిర్వహణ తదితరాలకు సంబంధించి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ నిబంధనల ప్రకారం నిర్వహించాల్సి.

ఎంపికైన ఆస్పత్రుల వివరాలు

నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్యూఏఎస్)కు పలు ఆస్పత్రులు ఎంపికయ్యాయి. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, పీహెచ్‌సీలు పత్తికొండ, శ్రీరంగరాజుపురం, కాణిపాకం, పైపాళ్యం, యూపీహెచ్‌సీలో నగరిలోని పుదుపేటనార్త్, సత్రవాడ, పుంగనూరులోని తూర్పుమొగసాల, చిత్తూరు టెలిఫోన్‌కాలనీ, ఏరియా ఆస్పత్రిలో పుంగనూరు, కుప్పం, 36విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఎంపికయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.



కాణిపాకంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఎన్‌క్వాస్ పరిశీలించే కేటగిరీలు

- ఆస్పత్రిలో తగిన మౌలిక సదుపాయాలు, శుభ్రమైన వాతావరణం, అవసరమైన వైద్య పరికరాల నిర్ధారణ
- అడ్మిషన్ నుంచి డిశ్చార్జ్ వరకు రోగి సంరక్షణ, వైద్య సేవల నాణ్యత, పర్యవేక్షణ
- ఆస్పత్రిలో సంక్రమించే ఇన్ఫెక్షన్లను నివారించడానికి ప్రొటోకాల్ అమలు
- ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి క్రమంతప్పకుండా శిక్షణ, మూల్యాంకనం
- రోగి రికార్డుల నిర్వహణ
- పేషెంట్ల పట్ల గౌరవ మర్యాదలు

నిధులొస్తాయి

ఆస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ఎన్‌క్వాస్‌కు అర్హత సాధించిన ఆస్పత్రులకు మూడేళ్ల పాటు ఏడాదికి రూ.50 వేల చొప్పున కేంద్రం బడ్జెట్ రిలీజ్ చేస్తుంది. వీటితో కాస్త ఆస్పత్రులకు కావాల్సిన వాటికి వ్యయం చేసుకోవచ్చు.
–సుధారాణి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

క్లుప్తంగా

పేదలందరికీ వైద్య సేవలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో 30 మంది రోగులకు పరీక్షలు చేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్‌వాధిగ్రస్తులు, వృద్ధులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. వేసవిలో ఎండలు అధికం కావడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులు ప్రతి రోజూ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో వినతుల స్వీకరణ


వినతులు తీసుకుంటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి బాధితుల ఇబ్బందులు తెలుసుకున్నారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడ్డ వాటిని ప్రాధాన్యత ఆధారంగా గుర్తించాలన్నారు. ఇతర వినతులను తక్షణం పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి సహాయ కమిషనర్ ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా భువనేశ్వరి



ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న భువనేశ్వరి సోమవారం ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న ధనలక్ష్మి ఏప్రిల్ 7వ తేదీ వరకు సెలవుపై వెళ్లడంతో ఏఓకు పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు.

కంటైనర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు


కొత్తపల్లె వద్ద బోల్తా పడ్డ కంటైనర్

బంగారుపాళెం: మండలంలోని కొత్తపల్లె చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటైనర్ బోల్తాపడింది. ఈ సంఘటనలో డ్రైవర్ గాయపడ్డాడు. మండలంలోని కొత్తపల్లె అండర్ బ్రిడ్జి సమీపంలో జాతీర రహదారిపై అరక్కోణం నుంచి టైల్స్ లోడ్‌తో కోలార్‌కు పోతున్న కంటైనర్‌ను చెన్నై నుంచి హసన్‌కు పోతున్న మరో కంటైనర్ వెనుక నుంచి ఢీ కొనడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మణి గాయపడ్డాడు. సమాచారం అందుకున్న సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరంలో 60 మందికి నేత్ర పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ అబ్బాస్

తవణంపల్లె: మండల కేంద్రంలోని జోసెస్ గాస్పెల్ చర్చిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చెన్నైకు చెందిన ఎం.ఎన్.కంటి ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ అబ్బాస్, డాక్టర్ అఖిల్ కంటి రోగులు 60 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 30 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సల కోసం ఎంఎన్ కంటి ఆస్పత్రికి తరలిస్తున్నట్లు జోసెస్ గాస్పెల్ చర్చి ఫాస్టర్ ఏసు, ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు పిలిఫ్, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలించి పరిష్కరిస్తా


అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమ్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ముట్టుకూరులో వాగు ఆక్రమణలు తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. భూ సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఐరన్‌తో రక్తహీనత దూరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: పిల్లల్లో రక్తహీనత తొలగించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఎంతగానో దోహదపడతాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. వడదెబ్బపై గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రత వల్ల వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించారు. పిల్లల్లో రక్తహీనత తొలగాలంటే తప్పకుండా ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నూతన ఏపీఓగా సంధ్యారాణి

యాదమరి: ఉపాధి హామీ మండల ఏపీఓగా సంధ్యారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐరాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ తవణంపల్లెకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఆమె ఉపాధి హామీ సిబ్బందితో మాటాడి లక్ష్యాలను తెలుసుకున్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గుడిపాల: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



తవణంపల్లె : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్య బృందం



బంగారుపాళెం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది




ఐరాల: ర్యాలీ చేస్తున్న డాక్టర్ పూర్ణలత, వైద్య సిబ్బంది

ఐరాల/బంగారుపాళెం/తవణంపల్లె/యాదమరి/ గుడిపాల/కాణిపాకం: క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దా మని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సోమ వారం చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గా ల్లోని మండల కేంద్రాల్లో అవగాహన ర్యాలీ లు నిర్వహించారు. ఐరాలలో పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత, బంగారుపాళెంలో డాక్టర్ లోహిత్‌వెంగల్‌రాయన్, తవణంపల్లెలో డాక్టర్ ప్రియాంక, యాదమరిలో డాక్టర్ లక్ష్మీనారాయణ, గుడిపాలలో డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చిత్తూరు నగరంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి నేతృత్వంలో జిల్లా ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


యాదమరి: వైద్య సిబ్బంది మానవహారం


చిత్తూరు: ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల

విద్యుత్ డివిజన్ కార్యాలయం పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయాన్ని ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆ బృందం సభ్యులు డివిజన్ కార్యాలయంలోని పలు విభాగాలకు సంబంధించి ఏడాది పాటు జరిగిన పనుల ఫైళ్లను పరిశీలించారు. క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటిన ట్రాన్స్‌కో ఐరాల ఏఈ నీరజను ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ అభినందించారు. అర్బన్ డివిజన్ కార్యాలయంలో ఆమెతో మాట్లాడారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి విద్యుత్ ఉద్యోగుల క్రీడ పోటీల్లో ఉమ్మడి జిల్లా పరంగా ఆమె ప్రతిభ చూపారు.


ఏఈ నీరజను అభినందిస్తున్న ఎస్‌ఈ ఇస్మాయిల్

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయించాలి

చిత్తూరు కలెక్టరేట్: బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించాలని ఆ గ్రామస్తులు గోవిందయ్య, గిరిబాబు, నాగరాజులు కోరారు. ఈ మేరకు వారు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్ శ్రీనివాసులు పారిశుధ్య పనులు చేయకుండానే నిధులు కాజేశారన్నారు. దాదాపు రూ.10 లక్షల నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఈ విషయం పై తగు ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేయించేందుకు విజిలెన్స్ అధికారులకు సిఫార్సు చేయాలన్నారు. దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేసి గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేసేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

పిల్లల సమగ్రాభివృద్ధి సాధిద్దాం

ఐరాల: నవచేతన్ ఆధార్ షీలా కార్యక్రమం ద్వారా ఆరేళ్ల లోపు పిల్లల్లో సమగ్రాభివృద్ధి సాధించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సీడీపీఓ నిర్మల ఆదేశించారు. పాలకల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ బీ- పడాయ్ బీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మూడు గ్రూపులుగా విభజించి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇందులో మొదటి రోజు బిడ్డ జన్మించినప్పటి నుంచి మూడేళ్ల లోపు నవచేతన్ ద్వారా సంపూర్ణ పోషణ, గ్రోత్ మానిటరింగ్, సలహాలు, సంప్రదింపులు, మైక్రో న్యూట్రీషియన్స్ నష్టపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. చిన్నారుల ఎత్తు, బరువు చూడటం, అదేవిధంగా 3 నుంచి 6 ఏళ్ల పిల్లల్లో పూర్తిస్థాయి సమగ్రాభివృద్ధిలో భాగంగా శారీరక, మేథోశక్తి, సాంఘికాభివృద్ధి, సాంస్కృతిక, సౌందర్యాభివృద్ధి తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్తిస్థాయి అవగాహనతో మెలగాలన్నారు. వీడియో, గ్రూపు డిస్కషన్‌ల ద్వారా, టీఎల్‌ఎం(టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) కూడా తయారు చేసి మొదటి రోజు శిక్షణ ఇచ్చినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంజుల, లావణ్య పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవితకు పునాది

యాదమరి: విద్యతోనే ఉజ్వల భవితకు పునాది సాధ్యమవుతుందని పీఆర్‌టీయూ ఉపాధ్యక్షుడు కనకాచ్చారి పేర్కొన్నారు. మండలంలోని వరిగపల్లె ప్రాథమిక పాఠశాలలో సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ చిన్నతనంలోనే చదువుపై పట్టు సాధించాలన్నారు. ఈ వేసవి సెలవులను వృథా చేయకుండా సృజనాత్మక శక్తి పెంపొందించుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన ఆట పాటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్, రైటింగ్ ప్యాడ్స్ బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హిమబిందు, కో–ఆప్షన్ మెంబర్ వరప్రసాద్, పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీ, వైస్ చైర్మన్ శోభ, పాఠశాల సిబ్బంది, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు




బంగారుపాళెం: విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు, **యాదమరి:** ఆటవస్తువులు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

బంగారుపాళెం: వైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదని జాతీయ క్రికెట్ క్రీడాకారుడు (పారాఒలింపిక్స్)గణేష్ అన్నారు. తగ్గువారిపల్లెలోని భవిత కేంద్రానికి సోమవారం చిత్తూరు రీడ్స్ సంస్థ వారు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు, రెండు ఫ్యాన్లు, క్యారమ్‌బోర్డు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన గణేష్ మాట్లాడుతూ, వైకల్యం ఉన్నా పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. సంస్థ కో–ఆర్డినేటర్ కోదండపాణి మాట్లాడుతూ, భవిత కేంద్రానికి మరింత సాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అముద, ఐఈఆర్పీలు హిమబిందు, మీరయ్య, సిఆర్‌పి సుశీల పాల్గొన్నారు.

దివ్యాంగులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

యాదమరి: దివ్యాంగులను క్రీడల్లో కూడా రాణించేలా చూడాలని ప్రముఖ క్రీడాకారిణి కాంచన, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజాక్ సూచించారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లలకు పుట్టుకతో వచ్చే జబ్బులపై అవగాహన కల్పించారు. అనంతరం సంస్థ సభ్యులు దివ్యాంగులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆసియా, సంస్థ చైర్మన్ థియో స్టీఫెన్స్, కో–ఆర్డినేటర్ కోదండపాణి, సిబ్బంది ఉమ, మహేష్ పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ప్రవీణ్

గుడిపాల: వేసవికాలంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. కొత్తకోట గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. అనంతరం మందులను ఉచితంగా అందజేశారు. మంచాన పడ్డ రోగుల ఇంటివద్దకే వెళ్లి చికిత్సలు చేశారు. గర్భవతులు ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు చేసుకుంటే రూ.5 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది హైమావతి, తమరై, గీత పాల్గొన్నారు.

బెట్టింగ్‌లతో జీవితాలు నాశనం

గుడిపాల: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ రామ్మోహన్ హెచ్చరించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కావడంతో యువత ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌ల జోలికెళ్లకుండా ఉండాలని చెప్పారు. చిన్న మొత్తాలతో ప్రారంభించిన బెట్టింగ్‌లు ఆసక్తి పెరిగే కొద్దీ పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోతారన్నారు. చివరకు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు దారి తీస్తాయన్నారు. ఈ తరహా కేసుల్లో నిందితులకు శిక్షతో పాటు జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగులకు పాల్పడేవారి సమాచారానికి డయల్ 100 లేదా 9440796712కి సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

మత్తుపదార్థాలకు యువత బానిసకారాదు


అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: యువత మత్తుపదార్థాలకు బానిసై బతుకులను నాశనం చేసుకోరాదని సీఐ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మత్తుపదార్థాలపై యువతకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, యువకులు గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సరదాగా చేసుకునే దురలవాట్ల కారణంగా జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మత్తుపదార్థాలు విక్రయించేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు, రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలు నడపాలన్నారు. వేసవిలో ఇళ్ల వద్ద రైతులు పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని హెచ్చరించారు. దొంగలు పశువులను అపహరించుకుపోయి ఇతర ప్రాంతాల్లో విక్రయించే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానితులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన అవసరం

ఐరాల: డౌన్ సిండ్రోమ్‌పై తల్లిదండ్రులకు అవగాహన అవసరమని స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో మార్చి 21వ తేదీ నిర్వహించాల్సిన ప్రపంచ డౌన్ సిండ్రోమ్ కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో సోమవారం రీడ్స్ సంస్థ చైర్మన్ థియో స్టీఫెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ జన్యు సంబంధమైన వ్యాధి అన్నారు. అనంతరం భవిత కేంద్రంలోని దివ్యాంగుల పిల్లలకు క్యారం బోర్డ్, నోట్ బుక్‌లు, పెన్సిళ్లు అందజేశారు. కేంద్రానికి కుర్చీలు, మ్యాట్స్ హెచ్‌ఎం చేతుల మీదుగా భవిత కేంద్రం ఉపాధ్యాయులు కవిత, సురేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో రీడ్స్ సంస్థ కో– ఆర్డినేటర్ కోదండపాణి పాల్గొన్నారు.


విద్యార్థినికి విద్యా సామగ్రి అందజేస్తున్న హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి